

ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'వైద్యజ్యోతి' కార్యక్రమంలో ఉచిత వైద్య సేవలు అందించి జ్ఞాపికలు అందుకున్న వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులు

వైద్యార్తులకు దారిదీపమైన 'వైద్యజ్యోతి'

- 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహణ
- అనూహ్య స్పందనతో ముగిసిన హెల్త్‌మీట్

తిరుపతి, మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'వైద్యజ్యోతి' పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా హెల్త్‌మీట్.. వైద్యార్తులకు దారిదీపంలా మారింది. తిరుపతిలోని తుడా ఇందిరా మైదానంలో శని, ఆదివారాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి నగరంతో పాటు జిల్లాలోని పలుప్రాంతాలనుంచి చికిత్స కోసం, వైద్యసలహాల కోసం రోగులు పోటెత్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగిన వైద్యజ్యోతిలో దాదాపు నాలుగు వేల మంది రోగులను వైద్యులు పరీక్షించి.. అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. మందులూ ఉచితంగా అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆయా ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ అర్హులైనవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పడంతో పాటు వైద్యసేవ పరిధిలో లేని వ్యాధులకు ప్రత్యేక రాయితీలను ప్రకటించారు. ఇలాంటి హెల్త్‌మీట్‌లలో అన్ని రకాల వైద్యనిపుణులను ఒకే గొడుగు కిందకు తీసుకు రావడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉండిందని రోగులు అన్నారు. భవిష్యత్తులోనూ 'ఆంధ్రజ్యోతి' నిర్వహించే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటామని వైద్యులు తెలిపారు. ఇక, శిబిరంలో శ్రీసాయిసుధ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి తరపున డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి పాల్గొని కంటి సమస్యతో బాధపడే రోగులను పరీక్షించి కంటి అద్దాలు అందజేశారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో వైద్యులు, సిబ్బందికి 'వైద్యజ్యోతి' జ్ఞాపికలను ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ సురేష్‌రెడ్డి, సిబ్బంది అందజేశారు.



• నేడు వరల్డ్ టీబీ డే

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమే..!

- ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యం

దగ్గే కదా అని నిర్లక్ష్యం చేస్తూ పోతే క్షయ (టీబీ)గా మారుతుంది. ఆపైనా పట్టించుకోకుంటే ప్రాణాంతకమవుతుంది. అదే.. మొదట్లోనే గుర్తిస్తే క్షయ నుంచి బయట పడొచ్చు.

జిల్లాలో దాదాపు రెండు వేల మంది వరకు క్షయ వ్యాధిగ్రస్థులు ఉన్నారు. వీరిలో 1200 మంది ప్రభుత్వ, 800 మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరికి అవసరమైన మందులను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారు. క్షయ పడిన బాధితులకు నిక్షయ పోషణ కింద కేంద్ర ప్రభుత్వం పోషకాహారంతోపాటు ఆరు నెలల చికిత్సా సమయంలో రూ.6 వేలను జీవన భృతికి అందిస్తోంది. ప్రాథమిక, ఏరియా, ప్రాంతీయ ఆస్పత్రుల్లో టీబీ మందులను ఉచితంగా అందిస్తున్నారు.

లక్షణాలు: విపరీతమైన దగ్గు, ఛాతీలో నొప్పి, తలనొప్పి, నీరసం, జ్వరం, అలసట, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చలి వేయడం, రాత్రి వేళ చెమటలు పట్టడం.

క్షయ నిర్మూలనే లక్ష్యం



జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించే దిశగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా మా సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి జిల్లాలోని క్షయ బాధితుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి మందులు ఇస్తున్నారు. ఈ వ్యాధిగ్రస్థులు ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

- డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి

ఇంట్లో వాళ్లూ జాగ్రత్తగా ఉండాలి



మూడు వారాల కంటే ఎక్కువగా దగ్గు ఉంటే దానిని క్షయగా నిర్ధారిస్తారు. ఇది అంటువ్యాధి. కాబట్టి దీని బారిన పడిన వారు ఇంట్లో ఉంటే మిగిలిన వారూ జాగ్రత్తగా ఉండాలి. రుయాస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో అవసరమైన మందులు ఉన్నాయి.

- డాక్టర్ సుబ్బారావు, ఊపిరితిత్తుల, శ్వాసకోశ వైద్య నిపుణుడు, రుయాస్పత్రి

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మళ్లీ.. స్వర్ణమ్మను చెరబట్టారు



స్వర్ణమ్మను చెరబడుతున్నారంటూ జనవరి 26న ప్రచురితమైన కథనం



ఆదివారం రాత్రి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వకాలు



శ్రీకాళహస్తిలో మట్టి దొంగలపై ఫిబ్రవరి 8న ప్రచురితమైన కథనం

'ఓం నమశ్శివాయ' అంటూ శివనామస్మరణ వినబడుతూ ఉంటుంది. ముక్కంటి దర్శనానికి వచ్చే భక్తుల రాకపోకలతో సందడిగా ఉంటుంది. అలాంటి చోట.. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపాన ఆదివారం రాత్రి ఓ ఎక్స్‌కవేటర్ దడదడమంటూ శబ్ధం చేస్తూ ఇసుక తవ్వుతోంది. ట్రాక్టర్లకు నింపుతోంది. ఆ ఇసుక ట్రాక్టరు ఆలయం నుంచి పొన్నాలమ్మ గుడివైపు వెళ్లే వంతెనపై వాయువేగంతో వెళుతూ భక్తులను భయాందోళనకు గురిచేసింది. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంది. 20 ఏళ్ల నుంచి పట్టణ పరిధిలో ఇసుక తవ్వకాలు జరగలేదు. రెండు నెలల కిందట కొందరు ఏకంగా ముక్కంటి ఆలయానికి ఎదురుగా ఉన్న స్వర్ణముఖి నదిలో పట్టపగలు, విచ్చలవిడిగా ఇసుక తవ్వేశారు. దీనిపై ఈ ఏడాది జనవరి 26వ తేదీన 'శివయ్యా.. స్వర్ణమ్మను చెరబడుతున్నారు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దాంతో ఇక్కడ తవ్వకాలకు అడ్డుకట్ట పడింది. మళ్లీ శ్రీకాళహస్తిలో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. గత నెలలో మహాశివరాత్రి సందర్భంగా పార్కింగ్ ప్రాంతం కేటాయింపు కోసం స్వర్ణముఖి నదిలో రోడ్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడా రోడ్డు ద్వారా ఆదివారం రాత్రి అక్రమార్కులు నదిలో ఇసుక తవ్వకాలను ప్రారంభించారు. యంత్రాలతో ఇసుక తవ్వేందుకు శ్రీకారం చుట్టారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు స్వర్ణముఖి నది నుంచి ఇసుకతో ముక్కంటి ఆలయం ముందు నుంచే అతివేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇసుక ట్రాక్టర్లు వెళుతున్న వేగాన్ని చూసి భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఇలా.. పట్టణ నడిబొడ్డున ఏకంగా యంత్రాలతో తవ్వుతూ మళ్లీ.. స్వర్ణమ్మను చెరబట్టారు. మరీ ఇంత దాష్టీకమా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

చెలరేగిన గ్రావెల్ మాఫియా

తొట్టంబేడు మండలం శివనాథపాళెం వద్ద గ్రావెల్ మాఫియా మళ్లీ చెలరేగిపోయింది. ఒకటిన్నర నెలపాటు స్తబ్ధుగా ఉన్న అక్రమార్కులు.. మళ్లీ ఆదివారం రాత్రి తవ్వకాలు చేపట్టారు. తెలుగు గంగ కాలువ పక్కన ఉన్న చెరువులో నుంచి ఏకంగా అక్రమంగా రోడ్డును నిర్మించేశారు. రాత్రి వేళల్లో యంత్రాలతో గ్రావెల్ తవ్వి.. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నారు. దీనిపై ఫిబ్రవరి 8వ తేదీన 'శ్రీకాళహస్తిలో మట్టి దొంగలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో కొన్నాళ్లపాటు గ్రావెల్ అక్రమ రవాణాను ఆపారు. మళ్లీ ఆదివారం రాత్రి రెండు ఎక్స్‌కవేటర్లు, పది టిప్పర్లు, 20 ట్రాక్టర్లతో గ్రావెల్ తవ్వకానికి దిగారు.

టెంకాయ చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరు తమిళనాడువాసుల దుర్మరణం
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- రాష్ట్ర సరిహద్దులో ప్రమాదం



మృతి చెందిన సంధ్రీన్ ఫాతిమా



చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

తడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని పన్నంగాడు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ముంబైలోని ఓ సంస్థలో పనిచేస్తున్న చెన్నై వేలచ్చేరికి చెందిన మహ్మద్ అవాజ్ కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చారు. స్థానికంగా ఇంజనీరింగ్ చదువుతున్న స్నేహితులు యోగీశ్వరన్, బెంజిమన్, ఆలీయా బేగం, శ్రీమాన్, మాదేష్, సంధ్రీన్ ఫాతిమా, దీనదయాళ్‌తో కలిసి ఆదివారం ఉదయం వరదయ్యపాళెం వద్దనున్న ఉబ్బలమడుగుకు అద్దె కారులో బయలుదేరారు. సరిహద్దులోని పన్నంగాడు వద్ద అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ తోపులోకి దూసుకెళ్లి.. ఓ చెట్టును ఢీకొంది. కారు నుజ్జునుజ్జు అయింది. డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ అవాజ్ వెనుక కూర్చొన్న సంధ్రీన్ ఫాతిమా(21) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన మిగిలిన ఏడుగురిని ఎలావూరు ఆస్పత్రికి.. తర్వాత చెన్నైలోని స్టాండ్లీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ దీనదయాళ్(34) మృతి చెందారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ కొండప్ప నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంధ్రీన్ ఫాతిమా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్వరలో పోలీసు శాఖ ప్రక్షాళన!

- భారీగా బదిలీలకు కసరత్తు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో ఇప్పటికే భారీగా పోలీసు బదిలీలు జరిగాయి. ఇప్పుడు తిరుపతి జిల్లాలోనూ పోలీసు శాఖ ప్రక్షాళనకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దృష్టి పెట్టారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా బదిలీలు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి మరో 10 రోజుల్లో కసరత్తు పూర్తి చేయనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఎవరు? గతంలో ఏకపక్షంగా వ్యవహరించిన వారు.. ఇప్పటికీ తీరు మార్చుకోని వాళ్లతో పాటు సమర్థంగా విధుల నిర్వహణ, క్రమశిక్షణ, కేసుల నమోదు, బాధితులకు న్యాయం అందించడంలో ముందుంటున్న వారి గురించీ వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. స్పెషల్ బ్రాంచ్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నట్లు సమాచారం. సీఐలతో పాటు 40 మందికిపైగా ఎస్‌ఐలు, 480 మందికిపైగా ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

నెలబల్లికి చేరిన సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ



దొరవారిసత్రం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 'సురక్షిత తీరం.. సమృద్ధి భారత్' పేరిట కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) చేపట్టిన సైకిల్ ర్యాలీ.. ఆదివారం దొరవారిసత్రం మండలం నెలబల్లి సమీపంలోని వాసవి ఆశ్రమానికి చేరింది. స్థానిక మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈనెల పదో తేదికి 55 వసంతాలు పూర్తి చేసుకున్న సీఐఎస్ఎఫ్ సముద్ర తీరప్రాంత ప్రజలలో దేశ భద్రత, సమైక్యతను పెంపొందించేందుకు సైకిల్ ర్యాలీ చేపట్టింది. 60 మంది సీఐఎస్ఎఫ్ బృందంతో ఈనెల 7న వెస్ట్ బెంగాల్‌లోని బక్కాలీలో ప్రారంభమైన సైకిల్ ర్యాలీ.. సోంపేట, శ్రీకాకుళం, విశాఖపట్నం, అన్నవరం, అమలాపురం, మచిలీపట్నం, చీరాల, ఒంగోలు, కావలి, నాయుడుపేట మీదుగా దొరవారిసత్రం మండలం నెలబల్లికి చేరింది. సూళ్లూరుపేట, తడ మీదుగా తమిళనాడులోకి ప్రవేశిస్తుందని సీనియర్ కమాండెంట్ కార్తికేయన్ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



లారీ, ప్రైవేటు కర్మాగారం బస్సు ఢీ

- ఆపై అదుపు తప్పి వాగులో పడ్డ బస్సు
- 15మందికి గాయాలు

శ్రీకాళహస్తి/వెంకటగిరిటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కర్మాగారం బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో బస్సు అదుపు తప్పి వాగులో పడింది. దీంతో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం ఎంపేడు సమీపంలో ఆదివారం జరిగింది. తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఓ ప్రైవేటు సెల్‌ఫోన్ కర్మాగారానికి చెందిన బస్సు వెంకటగిరి నుంచి 15మంది సిబ్బందితో బయలుదేరింది. రాయచోటికి చెందిన రాజు కృష్ణపట్నం పోర్టుకు లారీతో వెళ్తున్నాడు. ఎంపేడు వద్ద లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అదుపు తప్పిన బస్సు పక్కనే ఉన్న వాగులో బోల్తా పడింది. క్షతగాత్రులకు స్థానికులు సహాయక చర్యలందించారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడుకు చెందిన బస్సు డ్రైవర్ మునీంద్ర, వెంకటగిరి సమీపంలోని లింగసముద్రానికి చెందిన శివాజీ, లారీ డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడ్డారు. గుండ్లకుంటకు చెందిన ప్రసాద్, వెంకటగిరికి చెందిన కుశల్, రాపూరు యశోద స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఆరుగురుని 108 వాహనంలో చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన, మునీంద్ర, శివాజీ, రాజును తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనా స్థలంలో స్వల్పంగా గాయపడిన 9మంది క్షతగాత్రులు వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాగులో పడిన బస్సు

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:55 (మంగళవారం ఉదయం)

మా ఆరోగ్య భద్రతకు అభయం

● ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించిన వైద్యజ్యోతిలో ప్రజల మనోగతం

రెండు రోజులుగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'వైద్యజ్యోతి' శిబిరం తమ ఆరోగ్యానికి అభయమిచ్చిందని పలువురు పేర్కొన్నారు. రెండు రోజులపాటు చిన్నారుల మొదలు, వృద్ధుల వరకు వైద్య సలహాలు, వైద్య సేవలు పొందారు. దీనిపై వారి మనోగతం..

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

అన్ని వైద్య పరీక్షలూ చేసుకున్నా

బీపీ, షుగర్, బీఎండీ వంటి వైద్య పరీక్షలను కార్పొరేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఒకే దగ్గర చేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం చేసుకున్న వైద్య పరీక్షల్లో నాకు ఎలాంటి సమస్య లేదని తేలింది. ఈ అవకాశాన్ని కల్పించిన ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు.

- సోమశేఖర్‌రెడ్డి, తిరుపతి



మోకాళ్ల నొప్పులకు పరీక్ష చేసుకున్నా



ఎన్నో రోజులుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న నేను.. ఈ శిబిరంలో రెండు ఆస్పత్రులకు సంబంధించిన డాక్టర్ల దగ్గర చూపించుకున్నా. వారు పరీక్షించి అవసరమైన మందులు అవసరమైతే వాళ్ల ఆస్పత్రికి వస్తే ఉచితంగా వైద్యం చేస్తామనీ చెప్పారు.

- రాజమ్మ, భాకరాపేట

గుండె పరీక్షలు చేసుకున్నా



తిరుపతిలో చదువుతున్న మా కుమారుడిని చూసి మంచి గుండె పరీక్షలు చేయించుకోవాలని వచ్చా. వైద్యజ్యోతి కార్యక్రమం తెలిసి ఇక్కడ బీపీ, షుగర్, ఈసీజీ వంటి అన్ని రకాల పరీక్షలను ఉచితంగా చేయించుకున్నా. షుగర్‌కు దగ్గర్లో ఉన్నానని, కొంచెం జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సలహా ఇచ్చారు.

- ఎం.భాస్కర్‌రెడ్డి, కడప

రూ.వేలల్లో మిగిలింది



బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలతోపాటు ఎముకలకు సంబంధించిన బీఎండీ పరీక్ష కూడా చేసుకున్నా. ఇవన్నీ ప్రైవేటుగా చేసుకోవాలంటే రూ.వేలల్లో ఖర్చు అయ్యేది. దృష్టిలోపం ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించి మందులిచ్చారు.

- ఎన్.చంద్రశేఖర్‌నాయుడు

కాల్షియం లోపం ఉన్నట్లు తేలింది



ఇక్కడ అన్ని రకాల వైద్య పరీక్షలను చేయించుకున్నాను. బీఎండీ పరీక్షల్లో కొంత కాల్షియం లోపం ఉన్నట్లు తేలింది. దానికి తగిన సూచనలు, మందులను ఇక్కడే డాక్టర్లు అందించారు. అవసరమైతే ఆస్పత్రికి వస్తే ఉచితంగా వైద్యం చేస్తామని చెప్పారు.

- సుబ్బరత్నమ్మ, రేణిగుంట

దృష్టి లోపానికి మందులిచ్చారు

ఎన్నో రోజులుగా కంటి చూపు సమస్యతో బాధపడుతున్నా. ఈ వైద్యశిబిరానికి వస్తే ఉచితంగా కార్పొరేట్ వైద్య పరీక్షలు అందాయి. అవసరమైన మందులను ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

- పి.రాణెమ్మ, తిరుచానూరు



బాలయ్యపై అభిమానాన్ని చాటుకుంటూ..



మందులు పంపిణీ చేస్తున్న మనోహర్‌రెడ్డి

● రెట్టింపు ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు

తిరుపతి(జీవకోన), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తన అభిమాన హీరో నందమూరి బాలకృష్ణపై అభిమానాన్ని చాటుకుంటూ.. సేవా కార్యక్రమాల్లో రెట్టింపు ఉత్సాహంతో పాల్గొంటున్నారు మనోహర్‌రెడ్డి. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యజ్యోతి కార్యక్రమానికి ఈయన మెయిన్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. వైద్య సలహాల కోసం హాజరైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సినిమాల ద్వారా ప్రేక్షకులను, బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్‌గా సేవా కార్యక్రమాలను, హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజల కోసం నిరంతరం శ్రమించే బాలయ్య స్ఫూర్తితో.. ఆయన అభిమానిగా తానూ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మనోహర్‌రెడ్డి చెప్పారు.

సేవల్లోనూ.. సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్



శిబిరంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఉద్యోగులు

తిరుపతి నగరంలోని నిర్మాణ రంగంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఓ బ్రాండ్‌గా వెలుగొందుతోంది. ఇప్పటి వరకు తిరుపతిలో 10 ప్రాజెక్టులను ప్రారంభించి వెయ్యికి పైగా ప్లాట్లను, 83 విల్లాహౌస్‌లతో పాటు కమర్షియల్ ప్రాజెక్టులను నిర్మించింది. మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని మంగళం వద్ద సీపీఆర్ మండల ప్రాజెక్టు పేరుతో రూ.40లక్షలకే ప్లాట్లు అందిస్తున్నట్లు ఆ సంస్థ ఎండీ కేవీ చలపతిరెడ్డి, డైరెక్టర్ కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీపడబోమని, మధ్య తరగతి ప్రజల నుంచి ఉన్నత శ్రేణి వర్గాల వరకు నాణ్యమైన ప్లాట్లను అందిస్తామని తెలిపారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వైద్యజ్యోతి' కార్యక్రమానికి సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ కో స్పాన్సర్‌గా వ్యవహరించింది.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చంద్రగిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చంద్రగిరిలో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆ పార్టీ కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆదివారం ప్రారంభించారు. ఆరణి మాట్లాడుతూ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ బలపడి అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అరవ శ్రీధర్ మాట్లాడుతూ కూటమి నాయకులతో కలిసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో జనశ్రేణులు కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ అభినందనీయుడని కొనియాడారు. అంతకుముందు చంద్రగిరి జాతీయ రహదారిలోని నాగాలమ్మ క్రాస్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. క్లాక్ టవర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కొత్తపేటలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, ఆకేపాటి సుభాషిణి, రాజారెడ్డి, టీడీపీ నేతలు దొడ్ల కరుణాకర్ రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు, జనసేన నాయకులు బొమ్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం స్వాగతం పలకగా ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సాయంత్రం సినీనటుడు సుమన్ అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవో దేవరాజులు, వాహన ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు తిరుచానూరు టూరిస్టు బస్టాండుకు వేలం

తిరుచానూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పంచాయతీ టూరిస్టు బస్టాండు, షాపింగ్ కాంప్లెక్సుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మాధురి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టూరిస్టు బస్టాండు వేలం పాట సీల్డ్ టెండర్ నిర్వహిస్తారని, మధ్యాహ్నం పైన బహిరంగ వేలం ఉంటుందని వివరించారు. కాగా, ఈనెల 19న ప్రైవేటు బస్టాండుకు వేలం పాట నిర్వహించాల్సి ఉండగా పలు కారణాలతో వాయిదా పడిన విషయం విదితమే.

బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకుంటుంది

చంద్రగిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో ఆర్యవైశ్య సత్రంలో ఏపీ బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరు ఆనందసూర్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల పాలకమండళ్లలో అర్చకుడితో పాటు ఒక బ్రాహ్మణుడిని నియమిస్తామని తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వేద విద్యను అభ్యసించిన బ్రాహ్మణ నిరుద్యోగులకు మూడు వేల రూపాయల నిరుద్యోగ భృతిని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ధూపదీప నైవేద్యానికి నోచుకోలేని ఆలయాల కోసం టీటీడీ ప్రత్యేక నిధి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూర్వాశుల రామస్వామి, ప్రధాన కార్యదర్శి ములుగు కిరణ్ కుమార్, మల్లెం రంగనాథ శర్మ, శీనుస్వామి, కాకుమాను సిద్ధాంతి, కోడూరు గౌతమ్ శర్మ, ఆలూరు సాయివిజయ్ పాల్గొన్నారు.



నూతన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, భానుప్రకాష్‌రెడ్డి

నెరబైలు, ఉదయమాణిక్యం పంచాయతీల్లో గజదాడులు

● వరి, మామిడి, కొబ్బరి చెట్ల ధ్వంసం



ఎర్రావారిపాళెం, మార్చి22(ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లో శాశ్వత నివాసం ఏర్పరుచుకున్న ఏనుగులు వేసవి ప్రారంభం కాగానే పొలాలపై దాడులకు తెగబడుతున్నాయి. ఇంతవరకు దట్టమైన తలకోన అడవుల్లో తిష్టవేసి ఉన్న గజరాజులు ఆదివారం ఉదయం 11 గంటలకు నెరబైలు పొలాల మీదుగా ఉదయమాణిక్యం పంటలవైపు సాగాయి. వరి, మామిడి, టమోటా, కొబ్బరి పంటలను ధ్వంసం చేశారు. ఉదయమాణిక్యం పంచాయతీ గడ్డవారిపల్లె పొలాల్లో చేరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నెరబైలు గ్రామం, ఉదయమాణిక్యం పంచాయతీ సరిహద్దు పొలాల్లోనే ఉన్నాయి. పలువురు రైతుల మామిడి పంటలను తినేశాయి. వరిపైర్లను తొక్కేశాయి. గడ్డంవారిపల్లె రైతులు గట్టిగా కేకలు వేయడంతో పక్కనే ఉన్న గుట్టలోకి చేరాయి. రాత్రి 10 గంటల వరకు అక్కడే తిష్టవేశాయి. ఎప్పుడు ఎటువైపు దాడులు చేస్తాయో తెలియక సమీప గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఏనుగుల దాడులు నుంచి తమ పంటలకు శాశ్వత రక్షణకు పరిష్కారం చూపాలని రైతులు అధికారులను కోరుతున్నారు. గతంలో ఏనుగుల దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించేదని రెండు, మూడు సంవత్సరాల నుంచి చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సాధువులపై కేసులను మాఫీ చేయండి

తిరుపతి(జీవకోన), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ముంతాజ్ హోటల్ నిర్మాణాన్ని రద్దు చేయాలని కోరుతూ తిరుమలలో ఇటీవల నిరసన తెలిపిన సాధువులపై ప్రభుత్వం పెట్టిన కేసులను మాఫీ చేయాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మ ఓంకార్, టీడీపీ బీసీ సెల్ నాయకులు జగన్నాథం కోరారు. వారు మాట్లాడుతూ ముంతాజ్ హోటల్ నిర్మాణాన్ని రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం వెనుక సాధువులు కృషి ఉందని తెలిపారు. తిరుపతిని మాంస, మద్య రహితంగా చేయడానికి హిందువులంతా కలిసికట్టుగా పోరాటానికి సహకారం అందించాలని కోరారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలు వృథాకానివ్వం

తిరుపతి(ఆటోనగర్), మార్చి23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలు వృథాకానివ్వమని సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి అన్నారు. అమరవీరుల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం ర్యాలీగా నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అమరవీరులు చేసిన పోరాట స్ఫూర్తిని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

లైవ్ స్కెచ్‌లో ప్రతిభచాటిన చిన్నారులు

తిరుపతి(కల్చరల్), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలతీర్థం అందాలను లైవ్ స్కెచ్, పెయింటింగ్ ద్వారా చిన్నారులు రూపొందించిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. పీపుల్ ఆఫ్ తిరుపతి సంస్థ అర్బన్ లైవ్ స్కెచ్ పేరుతో చిన్నారుల చేత అందాలను గీయించారు. 13 మంది చిన్నారులు ఇందులో పాల్గొనగా అందులో కొందరు స్కెచ్‌లు, కొందరు పెయింటింగ్‌తో తమలోని ప్రతిభను చాటారు. నిర్వాహకులు అవినాష్, ఆర్టిస్ట్ యుగేష్, సభ్యులు గాయత్రిదేవి, శ్రావ్య, గణేష్, అర్చన, లావణ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి టీచరు మృతి

రామచంద్రాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం చిట్టత్తూరు క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి హిందీ ఉపాధ్యాయుడు శివకేశవులు(44) శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. చిట్టత్తూరుకు చెందిన ఈయన కమ్మపల్లి ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి పుత్తూరు వస్తుండగా 10గంటల సమయంలో చిట్టత్తూరు క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయారు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమైంది. 108 సిబ్బంది ఆయన్ను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ట్రైనీ ఐపీఎస్ హేమంత్, ఇన్‌ఛార్జి సీఐ గోవిందుడు, ఇన్‌ఛార్జి ఎస్ఐ రవీంద్రనాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివకేశవులకు భార్య జయలక్ష్మి, కుమార్తె నేహిత ప్రియ ఉన్నారు. ఆదివారం జరిగిన అంత్యక్రియలకు కమ్మపల్లి పాఠశాల విద్యార్థులు వచ్చి కన్నీటిపర్యంతమయ్యారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి నివాళులు అర్పించి శివకేశవులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతి చెందిన శివకేశవులు

ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.1.30 లక్షల విరాళం



గౌరీశంకర్‌కు చెక్ అందజేస్తున్న గోవిందమ్మ

తిరుపతి(విద్య), మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): తిరు పతి ఎస్వీ ప్రభుత్వ పాలి టెక్నిక్ కళా శాలకు పూర్వ విద్యార్థి రూ.1.30 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. 1984-87 సంవత్సరంలో కళా శాలలో సివిల్ ఇంజినీరింగ్ చదివిన వై.సురేష్‌బాబు సీనియర్ స్టాటజిస్ట్‌గా అమెరికాలో పనిచేస్తున్నారు. ఆయన తన తల్లి వై.గోవిందమ్మ ద్వారా ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్ ల్యాబ్‌కుగాను ఈ విరాళాన్ని అందజేశారు. కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి.గౌరీశంకర్‌కు చెక్కు అందజేశారు. పూర్వ విద్యార్థి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉమామహేష్, ఎస్.ఎం.ల్యాబ్ ఇన్‌చార్జి శాలం రాజు, సివిల్ లెక్చరర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మలయాళ స్వాముల విగ్రహం ఏర్పాటు చేయాలి

తిరుపతి(కల్చరల్), మార్చి 23(ఆంధ్రజ్యోతి) : మలయాళ స్వామివారి కాంస్య విగ్రహాన్ని ఏర్పేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థులు తీర్మానించారు. తిరుపతి బైరాగిపట్టెడలోని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రాం భవనంలో ఆదివారం వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మరణించిన పూర్వ విద్యార్థులకు నివాళులర్పించారు. పలు నిర్ణయాలు తీసుకున్నారు. 4 నుంచి 10వ తరగతి వరకు బాలుర పాఠశాలను పునఃప్రారంభించాలని, ఆశ్రమ జయంతిని 2026లో వైభవంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం గురువులు నరసప్ప నాయుడు, బాబురెడ్డి, హరినాథ్, నాగేంద్రమ్మలను సత్కరించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి బలరామ, మాజీ డీఈవో చెంగయ్య పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోండి

తిరుపతి(విద్య), మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ అసమాన దేశభక్తుడని, ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సాహితీవేత్త సాకం నాగరాజు పిలుపునిచ్చారు. ఆలిండియా డెమోక్రెటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) ఆధ్వర్యంలో భగత్‌సింగ్ సంస్మరణ కార్యక్రమం స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగింది. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్ర, పౌర చైతన్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్, జిల్లా కార్యదర్శి పరమేశ్వరరావు, నగర అధ్యక్షుడు నవీన్, ఏఐడీఎస్ఓ మాజీ రాష్ట్ర నాయకులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యకు ప్రాధాన్యత

తిరుపతి(రూరల్) మార్చి23(ఆంధ్రజ్యోతి): సమాజంలో నర్సింగ్ విద్యకు ప్రాధాన్యత ఉందని తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ అన్నారు. మల్లంగుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన లైటింగ్ ల్యాంప్-2025 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణలో నర్సింగ్ ముఖ్యమైన విభాగమన్నారు. రోగుల వ్యాధి నివారణ, ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మానసిక ధైర్యాన్ని పెంపొందించడం కోసం నర్సింగ్ విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు ఆయన జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి మురళీకృష్ణ, కళాశాల చైర్మన్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కూనపల్లి లావణ్యకుమారి, ఏవో భార్గవి పాల్గొన్నారు.

టైం స్కేల్ ఇవ్వండి

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): టీటీడీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సొసైటీ ఉద్యోగులకు టైంస్కేల్ అమలు చేయాలని టీటీడీ సొసైటీ వర్కర్స్ అసోసియేషన్ కోరింది. విద్యార్హతలు కలిగిన వారికి పరీక్షలు నిర్వహించి, మెరిట్ ఆధారంగా రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ తాము టీటీడీలో చేరామని, వివిధ సొసైటీల ద్వారా 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, తమకంటే తక్కువ సర్వీస్ ఉన్న వారికి టైంస్కేల్‌ను అమలు చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. సోమవారం జరగనున్న బోర్డు సమావేశంలో దీనిపై చర్చించి, తీర్మానం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

10న మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం

తిరుపతి(టీటీడీ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం ఏప్రిల్ 10న తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 12,320 కిలోల బియ్యం వేలానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. దీనికి సంబంధించి రూ.590 డీడీ తీసి టెండర్ షెడ్యూల్ పొందవచ్చునని పేర్కొంది. వేలంలో పాల్గొనేందుకు రూ.2,500 ఈఎండీగా చెల్లించాలని, ఇతర వివరాలకు టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం ఫోన్ 0877 2264429కి లేదా టీటీడీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

పోరాట యోధులకు నివాళి

తిరుపతి(కల్చరల్), మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోరాట యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఎల్లప్పుడూ ప్రజల గుండెల్లో చిరంజీవులని పులువురు కొనియాడారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా తిరుపతి చింతలచేను రైల్వే గేటు సమీపంలోని వారి విగ్రహాలకు వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో మల్లారపు నాగార్జున, ఆకుల మల్లేశ్వరరావు, మునిరాజులు, అంకమనాయుడు, అజీమ్, గురునాథం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

- శుక్రవారం హుండీ ఆదాయం: **రూ.3.40 కోట్లు**
- శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **75,428**
- తలనీలాలు సమర్పించిన వారు: **31,920**

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూ ఏటీజీ హెచ్ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూ కాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించాలి

తిరుపతి(విద్య), మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి జనసేవ దళ మార్చింగ్ నిర్వహించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి వివారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చలపతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్‌కుమార్, ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో రాణించాలి



రైఫిల్‌షూటింగ్ క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని శాప్ చైర్మన్ రవినాయుడు ఆకాంక్షించారు. ఆదివారం శ్రీనివాస క్రీడా సముదాయంలో శిక్షణ పొందుతున్న రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ బృందంలోని షరన్ చంద్రిక స్పోర్ట్స్ కోటాలో అసిస్టెంట్ సెరికల్చర్ ఉద్యోగం పొందిన విషయం తెలుసుకుని అభినందించారు. ఎన్.సుష్మ రాష్ట్రస్థాయి పోటీలలో బంగారు పతకం సాధించిన విషయం రైఫిల్ షూటింగ్ చిత్తూరు జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు ఆయన దృష్టికి తేగా అభినందించారు. యువ క్రీడాకారులకు శాప్ సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు.

జన సైనికులు పేదలకు అండగా నిలవాలి

తిరుపతి అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జన సైనికులు పేదలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. నగర పరిధిలోని 35వ డివిజన్ వార్డు సచివాలయ ఆవరణలో జనసేన నాయకులు డాక్టర్ హరికృష్ణరాయల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, పేదలకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన హరికృష్ణ అభినందనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ అఖిల, డాక్టర్ కల్యాణ్‌కుమార్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి, ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

10న స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభం

తిరుపతి(క్రీడలు), మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 10వ తేదీన శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని స్విమ్మింగ్‌పూల్‌ను పునఃప్రారంభిస్తామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. స్విమ్మింగ్‌పూల్ ఆధునికీకరణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. పనుల ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వేసవి సెలవులు, సమ్మర్ క్యాంపుల ప్రారంభానికి మునుపే ఈతకొలనును నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ వయొలిన్ వాయిద్య కళాకారులు అన్నవరపు రామస్వామి, ఇండియన్ మాజీ క్రికెటర్ నిఖిల్ చోప్రా, సినీ నిర్మాత డీవీవీ దానయ్య ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(కల్చరల్), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు ఆలయ శుద్ధి, పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు.

పన్ను చెల్లింపులో అవగాహన అవసరం

తిరుపతి అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నూతన బడ్జెట్‌లో పొందుపరిచిన చట్టాలతో పాటు జీఎస్టీపై అవగాహన పెంచుకుని పన్నులు చెల్లించాలని ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ పాల్గుణకుమార్ తెలిపారు. ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2025-26 కేంద్ర బడ్జెట్, జీఎస్టీ చట్టాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు చట్టాలపై అవగాహన చేసుకోవాలని, తద్వారా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని తెలిపారు. ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలని, వ్యాపార లావాదేవీలు రూ.2 కోట్లు మించితే తప్పకుండా ఆడిట్ చేయించాలని అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు కె.వి.చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి, పుత్తూరు నుంచి వ్యాపారులు హాజరయ్యారు.

రసవత్తరంగా కవి సమ్మేళనం

తిరుపతి(కల్చరల్), మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): కవితలు, పద్యాలు, గేయాలు, సమకాలీన సామాజిక నేపథ్యంపై కవితల పోటీ రసవత్తరంగా సాగింది. తిరుపతి తెలుగు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బైరాగి పట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం కవి సమ్మేళనం సంబరంగా నిర్వహించారు. 50 మంది కవులు వివిధ రకాల కవితలతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ఐదుగురిని ఎంపిక చేసి ఉగాది వేడుకల్లో ఘనంగా సత్కరించనున్నారు.

నేడు టీబీ డే ర్యాలీ

తిరుపతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజ్, రుయా పల్మనరీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయ (టీబీ) వ్యాధి దినోత్సవం నిర్వహిస్తున్నట్టు విభాగాధిపతి డాక్టర్ ఎస్.సుబ్బారావు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ర్యాలీ ఉంటుందని, అనంతరం ఎస్వీఎంసీ కాలేజ్ ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా రంగోత్సవం



శ్రీవెంకటేశ్వర చిల్డ్రన్స్ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

తిరుపతి(విద్య), మార్చి 23(ఆంధ్రజ్యోతి): భవానీ నగర్‌లోని శ్రీవెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రంగోత్సవ్-2025 ఆదివారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్, ప్రముఖ న్యాయవాది కేఎస్ వాసు కార్యక్రమాలను ప్రారంభించారు. విద్యార్థులు దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి, తల్లిదండ్రులపై గౌరవం, సత్ప్రవర్తన అంశాలతో నృత్య రూపకాలను, నాటకాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. ముఖ్యంగా నాల్గవ తరగతి విద్యార్థుల ప్రదర్శన తల్లికి గౌరవ వందనం కార్యక్రమం అబ్బురపరిచింది. ఈ కార్యక్రమాల్లో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మాధవి, ప్రజా సంబంధాల అధికారి ఈశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేప్ నూతన కార్యవర్గం ఎన్నిక

తిరుపతి అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్(టేప్) నూతన కార్యవర్గం ఎంపికైంది. స్థానిక టేప్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్‌గా టి.వెంకటేశ్‌బాబు, అధ్యక్షుడిగా ఎం.ప్రసాదరెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.నాగేశ్వరరావు, ఎ.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా బి.షణ్ముగం, కోశాధికారిగా సందేస్, సహాయ కార్యదర్శులుగా శివశంకర్‌రెడ్డి, బంగారయ్య, ఆర్గనైజింగ్, వెల్ఫేర్ సెక్రటరీలుగా నరేష్, సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు నూతన కమిటీని అభినందించారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి జయప్రకాష్, నాగశ్రీనివాస్, మదనగోపాల్ పాల్గొన్నారు.

చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(టీటీడీ), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర కోరారు. టీటీడీ పరిపాలన భవనం ఎదుట చిరు వ్యాపారులు చేస్తున్న దీక్షలో భాగంగా ఆదివారం అలిపిరి పాదాల మండపం వద్ద తలపై శ్రీవారి ఫొటోలను పెట్టుకుని 216 టెంకాయలు కొట్టి స్వామివారిని ప్రార్థించారు. జయచంద్ర మాట్లాడుతూ 216 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిట్టిబాబు, మధు, యుగంధర్, చిరంజీవి, రాంబాబు, ప్రకాష్, గోపి, మల్లి, రామ్మూర్తి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్బరాయన్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు.

వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలి

- అహోబిల మఠాధిపతి

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలని అహోబిల మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అన్నారు. తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠాన్ని ఆయన ఆదివారం ఉదయం సందర్శించి విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. వేద విద్యాభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వేద విద్యావిధానం అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి 17 వేదాలను పఠించారు. కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, టీటీడీ ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, వేద, ఆగమ పండితులు పాల్గొన్నారు.

మఠంలో 'శ్రీవేదాంతదేశిక స్తోత్రమాలికా' ఆవిష్కరణ

తిరుమలలోని అహోబిలం మఠంలో ఆదివారం 'శ్రీవేదాంతదేశిక స్తోత్రమాలికా' గ్రంథాన్ని మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవికుల స్తోత్రాలన్నీ మంత్రగర్భితములని, ప్రతి మనిషీ కష్టాలను, వ్యాధులను పోగొట్టడంతో పాటు చదువు సంస్కారాన్ని ఇస్తాయని అన్నారు.

తిరుపతి రూరల్‌లో కార్డన్ సెర్చ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట పంచాయతీ వెంకటాద్రి అపార్టుమెంటులో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ ప్రసాద్ నేతృత్వంలో సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు రామకృష్ణ, షేక్ షావలి సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానమున్న వారి ఆధార్ కార్డులను పరిశీలించారు. నేర చరిత్ర గల వ్యక్తుల సమాచారం తీసుకున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ముత్యాలమ్మ జాతర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ జాతరను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో జాతర నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25నుంచి 28వ తేదీ వరకు ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించామని చెప్పారు. భక్తులకు క్యూలైన్లలో ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను అందుబాటులో ఉంచామన్నారు. జాతర ముగిసిన తరువాత 28వ తేదీన కూడా బస్సులను నడిపేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి, తహసీల్దారు శ్రీనివాసులు, ఈవో నవీన్‌కుమార్, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పేటేటి చంద్రనీల్, ఒబ్బాయి శివకుమార్, అన్నం మునిశేఖర్‌గౌడ్, సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

మాధవ నాయుడి జన్మదిన వేడుకలు



మాధవనాయుడికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, పెరుమాల్ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవనాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో జరిగాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకుల సమక్షంలో మాధవనాయుడు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, ఏజీ కిషోర్, వాకచర్ల రమేష్, అలవల శ్రీనివాసులు, బొమ్మణ పళణి తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

తడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 28న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం తడలో ఏఐటీయూసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేయడంలో పలు రాష్ట్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న 46వేల క్లెయిమ్‌లకు సంబంధించిన కార్మికుల విధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ సంస్థల నుంచి ఒకశాతం సెస్ వసూలు, చేస్తున్నారని, దానిని రెండు శాతానికి పెంచాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, నాయకులు రవి, శ్రీనివాసులు, కుమార్, చల్లయ్య, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయండి



మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు, నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో వైసీపీ నాయకులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం జరగదని, ప్రతి కౌన్సిలర్‌తో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు.

సామంచిని కలిసిన బీజేవైఎం నాయకులు



సామంచి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

గూడూరు అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌ను గూడూరుకు చెందిన బీజేవైఎం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని బీజేపీ కార్యాలయంలో సామంచి శ్రీనివాస్ కలిసిన బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, నాదముని తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత క్యాలెండర్ ఆవిష్కరణ

వెంకటగిరి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగవద్గీత క్యాలెండర్‌ను త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక, శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం త్రైత శకం 47 తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించామన్నారు. ఈ క్యాలెండర్‌లో ఆత్మజ్ఞానం, తెలుగ పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, భగవద్గీత శ్లోకాల సారం గురించి ప్రచురించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చల్లా సమన్, శ్రీనివాసులు, అమరావతి, చామంతి, వెంకటలక్ష్మి, కృష్ణ ప్రబోధ, వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు 9 గంటల నుంచి గ్రీవెన్స్ డే

చిల్లకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి గ్రీవెన్స్ డే నిర్వహించనున్నామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే సంద ర్భంగా 9నుంచి 1గంట వరకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నాయుడుపేట టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పట్టణంలో విద్యుత్ వినియోగం పెరగడంతో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శివశంకర్ తెలిపారు.

బైక్ బోల్తా: ఇద్దరికి గాయాలు

కోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు క్రాస్‌రోడ్డులో ఆదివారం మోటారు బైక్ బోల్తా కొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యానగర్‌కు చెందిన రవి, ప్రసన్న మోటారు బైక్‌లో తూర్పు కనుపూరుకు వెళ్తుండగా కొక్కుపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బోల్తా కొట్టారు. ఈ ఘటనలో బైక్‌లో వెళ్తున్న రవి ప్రసన్నకు గాయాలు కాగా, స్థానికులు కోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.





వరద సమయంలో కోతకు గురైన రోడ్డు - మధ్యలో భారీ గుంత

మానని వరద గాయం

- కొరిడి - పేర్నాడు రోడ్డుకు గుంతలు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండేళ్ల వచ్చిన వరదలకు తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే కొరిడి - పేర్నాడు రోడ్డు పులికాట్ సరస్సు నీటి ఉధృతికి కోతకు గురైంది. రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గోతులుపడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2023లో వచ్చిన మిచౌంగ్, 2024లో వచ్చిన ఫెంగల్ తుపాన్ ప్రభావంతో పులికాట్ సరస్సుకు భారీగా వరదనీరు చేరింది. వరద ఉధృతికి అట్టకానితిప్ప నుంచి కొరిడి - పేర్నాడు రోడ్డు దాదాపు 3 కిలో మీటర్ల వరకు ఇరువైపులా కోతకు గురైంది. శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు నుంచి అట్టకానితిప్ప నుంచి పేర్నాడుకు పులికాట్ సరస్సు మధ్యలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అటవీశాఖ అడ్డంకులతో తారురోడ్డు నిర్మాణం నేటికీ నెరవేరలేదు. ఉన్న గ్రావెల్ రోడ్డు అధ్వానంగా మారడంతో తీరప్రాంత గ్రామ ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. తీర ప్రాంతంలోని కొరిడి, దామరాయి, కడపత్ర మూడు పంచాయతీ పరిధిలో దాదాపు 23 గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డేగతి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డుకు తట్టెడు మట్టివేసిన పాపానపోలేదు. వరుసగా రెండు తుఫాన్లు రావడంతో రోడ్డు కోతకు గురైనా కనీసం మరమ్మతులు చేయలేదు. దాదాపు మూడు కిలో మీటర్ల మేర రోడ్డుపై గోతులు పడటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలైతే ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవతీసుకుని తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగునకు చర్యలు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

గూడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు, వారిని ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చేనేత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికుల ఇళ్లకు 100 యూనిట్లు వరకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేబినేట్‌లో నిర్ణయాన్ని తీసుకుని ప్రకటించడంతో నేతన్నలు హర్షం తెలుపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేతల సంక్షేమాన్ని విస్మరించిందని, ఎటువంటి రాయితీలు ఇవ్వలేదని నేతన్నలు చెబుతున్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు కొందరికే ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఉచిత విద్యుత్ హామీని తుంగలో తొక్కేశారని విమర్శిస్తున్నారు. చెబుతున్నారు. ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేత కార్మికుల కుటుంబాల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన కొద్ది నెలల్లోనే 100 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించే వారు బిల్లులు చెల్లించే అవసరం లేకుండా ఆదేశాలను జారీ చేసింది. మరింత మంది నేతన్నలకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో దీనిని 200 యూనిట్లకు పెంచడంతో వారితో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో 500, విందూరు గ్రామంలో 40 వరకు చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనుండడంతో సుమారు 320కు పైగా కుటుంబాలకు లబ్ధి చేకూర నుంది. చేనేత కార్మికులు గుర్తింపు కార్డుతో విద్యుత్‌శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఈ పథకం వర్తిస్తుందని చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అర్హులైన చేనేతలు సద్వినియోగం చేసుకోవాలి. 100 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కొందరు మాత్రమే సద్వినియోగం చేసుకుంటున్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా ఎంతో మందికి లబ్ధిచేకూరుతుంది.

- కటికాల శ్రీనివాసులు, చేనేత సంఘ నాయకుడు, చెన్నూరు





సూళ్లూరుపేటలో రాత్రిపూట చెత్త తొలగిస్తున్న సిబ్బంది - తెల్లారేసరికి తళతళ మెరుస్తున్న బాపూజీవీధి

సూర్యోదయానికల్లా వీధులన్నీ తళతళ

మున్సిపాలిటీ రాత్రివేళ పారిశుధ్య పనులు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉదయం చూసేసరికి సూళ్లూరుపేటలోని కూరగాయల మార్కెట్ సెంటర్, ప్రధాన కూడళ్లు, బజారు వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతుండేవి. కాలువల్లో వ్యర్థాలు తేలుతూ దుర్గంధం నిండేది. మున్సిపాలిటీ పరిధిలో రోజుకు దాదాపు 25టన్నుల మేర చెత్త పోగవుతోంది. 136 మంది పారిశుధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములవుతున్నారు. ఇంతమంది ఉన్నా రాత్రయ్యేసరికి పట్టణంలోని ప్రధాన వీధులు, జీఎన్‌టీ రోడ్డు చెత్త చెదారం, వ్యర్థాలతో అధ్వానంగా ఉంటున్నాయి. కచ్చేరి, బాపూజీ, పొట్టి శ్రీరాములు వీధులతో పాటు కూరగాయల మార్కెట్ సెంటర్‌లో రోడ్లపై వ్యర్థాలు నిండిపోతున్నాయి. కొన్ని సమయాల్లో ద్విచక్ర వాహనాలు కూడా పోలేని పరిస్థితి. ఉదయం పారిశుధ్య సిబ్బంది వచ్చి వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లేసరికి మధ్యాహ్నం అయిపోతోంది. పట్టణ సుందరీకరణకు ఇది ప్రధాన అడ్డంకిగా మున్సిపాలిటీ అధికారులు భావించారు. ఈ పరిస్థితిని మార్చడానికి రాత్రి వేళల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం బజారు ప్రధాన వీధులతో పాటు కూరగాయల మార్కెట్ సెంటర్‌లో రాత్రి సమయాల్లో 8 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించారు. వీరు రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు పనులు చేస్తున్నారు. ఇంకేముంది.. తెల్లారి చూసే సరికి రహదారులు తళతళమని మెరుస్తున్నాయి.

విద్యా వికాసానికి క్రీడా పోటీల దోహదం

కలికిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు గెలుపోటముల కోసం కాదని, వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, జట్టు స్ఫూర్తికి దోహదం చేస్తాయని కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో మూడు రోజులు జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల ముగింపు ఆదివారం జరిగింది. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అనంతపురం జేఎన్టీయూ పీడీ జోజి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 830 విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్, పురుషులు డబుల్స్)లో విన్నర్‌గా జేఎన్టీయూ అనంతపురం, రన్నర్‌గా కోట మండలంలోని ఎన్‌బీకేఆర్ కళాశాల జట్టు నిలిచాయి. టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్)లో జేఎన్టీయూ అనంతపురం విన్నర్ కాగా, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్ జట్టు నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషులు డబుల్స్)లో మిట్స్ మదనపల్లె విన్నర్‌గా, విశ్వోదయ కావలి రన్నర్‌గా నిలిచాయి. హ్యాండ్‌బాల్ (మహిళలు)లో పులివెందుల జేఎన్టీయూ విన్నర్‌గా, ఎన్‌బీకేఆర్ రన్నర్‌గా నిలిచింది.

రైల్వేస్టేషన్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు

నాయుడుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డివిజన్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ మెంబరు(డీఆర్‌యూసీసీ) పేర్నాటి జోసెఫ్, సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు మస్తానయ్య, కార్యదర్శి రాఘవన్, కిరణ్, ఆధ్వర్యంలో ఆదివారం నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే విజయశ్రీ, ఎంపీ గురుమూర్తి సహకారంతో వాటర్ కూలర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌యూసీసీ సభ్యులు జోసెఫ్, మస్తానయ్య, రాఘవన్ తదితరులు

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరంలో జనసేన నాయకులు

గూడూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సినీహీరో రామ్‌చరణ్ తేజ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్, కార్తీక్, సునీల్, రవి, మనోజ్, గురుబాబు, మహేష్, సాయి, సనత్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ



శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 25వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 515 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,787మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,219మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,822మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,242, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 347, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 310మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 81మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,262 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చెత్త కుప్పకు నిప్పు



వెంకటగిరి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనందపురంలో గుర్తు తెలియిన వ్యక్తులు ఆదివారం చెత్తకు నిప్పంటించడంతో భారీగా మంటలు చెలరేగాయి. స్థానికులు 101కు ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ అధికారి నారాయణ మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్యాస్, విద్యుత్, పేలుడు పదార్థాలు వాడుతున్నపుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానికులు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని చెత్త ఇక్కడే వేయడంతో డంపింగ్ యార్డ్‌లా మారిపోయిందన్నారు. ఎన్నిసార్లు మున్సిపాలిటీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఇక్కడి నుంచి చెత్త తొలగించాలన్నారు.

నేడు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయ లెక్కింపు సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధ్యాత్మికత, సేవకు ప్రతిరూపం రంజాన్



రంజాన్ కిట్లు అందజేస్తున్న మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ప్రతినిధులు

గూడూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత, సేవకు రంజాన్ మాసం ప్రతిరూపంగా నిలుస్తుందని నియోజకవర్గ ముతవల్లి కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌రహీం అన్నారు. ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మత సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, ఇమామ్ హరూన్, రఫీ, బాబర్, అన్వర్, ఆజాద్, రహీం, కరిముల్లా, యూసఫ్ పాల్గొన్నారు.

10న మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం

తిరుపతి(టీటీడీ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం ఏప్రిల్ 10న తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 12,320 కిలోల బియ్యం వేలానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. దీనికి సంబంధించి రూ.590 డీడీ తీసి టెండర్ షెడ్యూల్ పొందవచ్చునని పేర్కొంది. వేలంలో పాల్గొనేందుకు రూ.2,500 ఈఎండీగా చెల్లించాలని, ఇతర వివరాలకు టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం ఫోన్ 0877 2264420కి లేదా టీటీడీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలి

అహోబిల మఠాధిపతి

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలని అహోబిల మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అన్నారు. తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠాన్ని ఆయన ఆదివారం ఉదయం సందర్శించి విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. వేద విద్యాభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వేద విద్యావిధానం అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి 17 వేదాలను పఠించారు. కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, టీటీడీ ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, వేద, ఆగమ పండితులు పాల్గొన్నారు.

మఠంలో 'శ్రీవేదాంతదేశిక స్తోత్రమాలికా' ఆవిష్కరణ

తిరుమలలోని అహోబిలం మఠంలో ఆదివారం 'శ్రీవేదాంతదేశిక స్తోత్రమాలికా' గ్రంథాన్ని మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవికుల స్తోత్రాలన్నీ మంత్రగర్భితములని, ప్రతి మనిషీ కష్టాలను, వ్యాధులను పోగొట్టడంతో పాటు చదువు సంస్కారాన్ని ఇస్తాయని అన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.40 కోట్లు లభించింది. శనివారం 75,428 మందిభక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం స్వాగతం పలకగా ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సాయంత్రం సినీనటుడు సుమన్ అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవో దేవరాజులు, వాహన ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

చిచ్చురేపిన అనుమానం... యువకుడిపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న రవితేజ

శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అనుమానం పగను పెంచింది. పంట పొలాల్లో మాటు వేసి కత్తితో యువకుడిపై హత్యాయత్నానికి దారి తీసింది. ఈ ఘటన ఏర్పేడు మండలం సిద్ధయ్యగుంట వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. ఏర్పేడు మండలం సిద్ధయ్యగుంటకు చెందిన రవితేజ(23) రైతు కూలీ. ఇతని ఇంటికి సమీపంలోని మహేష్ కుటుంబం కల్లుగీతపై ఆధారపడి జీవనం సాగిస్తుంటుంది. తరచూ రవితేజ వారికి ఇంటికి వెళ్లి కల్లు తాగేవాడు. ఈ క్రమంలో కల్లుగీత కార్మికుడు భార్య ఉషతో సన్నిహితంగా ఉండేవాడు. ఏడాదిన్నర క్రితం తన భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడన్న అనుమానంతో రవితేజతో మహేష్ గొడవపడ్డాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య మాటలు లేవు. ఆదివారం రవితేజ గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులతో కలిసి పొరుగున ఉన్న సరస్వతి కండ్రిగలో వరిగడ్డిని లోడ్ చేయడానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి పంట పొలాల్లో నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో సిద్ధయ్యగుంట వద్ద కోనకాల్వ సమీపంలోని రవితేజ బహిర్భూమికోసం వెళ్లాడు. అకస్మాత్తుగా వెనుక నుంచి వచ్చిన మహేష్ కత్తితో రవితేజపై దాడి చేశాడు. ఈఘటనలో రవితేజ తీవ్రంగా గాయపడి గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఇద్దరు యువకులు అక్కడికి చేరుకోవడంతో మహేష్ పారి పోయాడు. రవితేజను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న ఏర్పేడు పోలీసులు విచారణ చేపట్టారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



వరదయ్యపాళెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం పంచాయతీ కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కారిపాకం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ... రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ కృషి కారణంగా నేడు అర్హులైన వారందిరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. నందగోపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, చెంచుకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కారిపాకం సర్పంచ్ వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొండమిట్టలో ఆకస్మిక తనిఖీలు



శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండమిటలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 1టౌన్ సీఐ గోపి సిబ్బందితో కలిసి కొండమిట్ట ప్రాంతంలో సంచరించారు. అనుమానిత వాహనాలపై ఆరా తీశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు ఎప్పటికపుడు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ పార్కులో వాకర్స్‌తో సమావేశమయ్యారు.

రైతులు విశిష్ట గుర్తింపుకార్డు పొందాలి

కేవీబీపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతిరైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన విశిష్ట గుర్తింపుకార్డులు పొందాలని వ్యవసాయాధికారి మురళీకృష్ణకుమార్ చెప్పారు. ప్రతిరైతు వారికి సంబంధించిన సచివాలయంలో రైతు భరోసా కేంద్రాల్లో తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌లింక్, బ్యాంకు పాసుపుస్తకం తీసుకెళ్లి వారు నమోదు చేసుకున్నట్లైతే ప్రభుత్వం నుంచి వారికి గుర్తింపు కార్డులు పంపిస్తారని చెప్పారు.

మనోధైర్యమే ఆరోగ్యం

శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మనోధైర్యమే ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని జయరామరావువీధిలో వృద్ధులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలీసుల ద్వారా అందించే సేవలను వారికి వివరించారు. 1టౌన్ సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

బలిజ సేన శ్రీకాళహస్తి అధ్యక్షుడిగా వెంకటేష్



శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బలిజ సేన శ్రీకాళహస్తి అధ్యక్షుడిగా కుప్పాల వెంకటేష్(డుమ్మురాయల్)ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంటకేష్ మాట్లాడుతూ... బలిజల అభివృద్ధి, ఆశయ సాధన కోసం కృషి చేస్తానన్నారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయనకు జనసేన నాయకులు కావలి శివకుమార్, తోట గణేష్, రవికుమార్‌రెడ్డి, సురేష్, వీరమహిళలు రాజ్యలక్ష్మి, లక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు.

పుత్తూరు వార్తలు

ముస్లిం మైనార్టీల సంక్షేమమే లక్ష్యం

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం గేట్ పుత్తూరులో రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లిం మహిళలకు చీరల పంపిణీ చేశారు. ముస్లిం మైనార్టీ నాయకులు మజీద్ సాహెబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతకుముందు ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. మాజీ ఎంపీపీ అమ్ములు, మున్సిపల్ మాజీ చైర్మన్ కరుణాకర్, నాయకులు గణేష్, షణ్ముగరెడ్డి, అశోక్, సుధ, కృష్ణకుమార్, దొరస్వామి, హమీద్ బాషా, చాన్, సద్దర్, యూనిష్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని అడ్డుకుందాం

పుత్తూరు టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి):మతోన్మాదాన్ని అడ్డుకుందామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పుత్తూరు పట్టణంలోని బీసీ హాస్టల్‌లో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ... దోపిడీదారుల చేతిలో మతం సాధనమని, మనిషి అసలు గుణం ప్రేమ అని, కులం, మతం కాదని భగత్‌సింగ్ అన్నారని చెప్పారు. ఉమేష్ చంద్ర, వినయ్, ఉపేంద్ర, శ్రీనివాసులు, సురేష్, రాజశేఖర్ హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువకులు అప్రమత్తంగా ఉండాలి

వడమాలపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిచిత వ్యక్తులను గమనిస్తూ యువకులు అప్రమత్తంగా ఉండాలని పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర చెప్పారు. ఆదివారం పోలీసులు గ్రామంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మార్నింగ్ వాక్ చేస్తున్న వారికి భద్రత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సెల్ ఫోన్ ఉపయోగించే వ్యక్తులు పలు యాప్‌ల ద్వారా మోసానికి గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో వడమాలపేట, నారాయణవనం ఎస్ఐలు ధర్మారెడ్డి, రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



వడమాలపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముస్లింలకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. వడమాలపేట మసీదులో ఆదివారం ఎమ్మెల్యేకు ముస్లిం నాయకులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉంటుందన్నారు.

ప్రజా వేదిక వేళల్లో మార్పు

సత్యవేడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వేళల్లో మార్పు చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్సీ బాలుర వసతిగృహం ప్రారంభమయ్యేనా?



నిరుపయోగంగా ఉన్నబాలుర వసతిగృహం - పగిలిన తలుపులు, కిటికీలు

కేవీబీపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గత టీడీపీ హయాంలో ఈ వసతి గృహ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారు. ఈక్రమంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అధికారుల నిర్లక్ష్యంతో వసతి గృహ బాధ్యతలను సరిగ్గా నిర్వహించ లేదు. దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. దీన్ని సాకుగా చూపి వసతి గృహాన్ని మూసివేశారు. సుమారు 300మంది విద్యార్థులు మండలకేంద్రంలో ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరు మండలంలోని చిట్టచివరి గ్రామాలనుంచి రెండు, మూడు బస్సులు మారి కేవీబీపురానికి చేరుకోవాల్సి ఉంటుంది. గతంలో వసతిగృహం ఉండడంతో విద్యార్థులు అక్కడే ఉండి విద్యను అభ్యసించేవారు. వసతిగృహం లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ యేడాదైనా ఉన్నతాధికారులు స్పందించి కేవీబీపురం ఎస్సీ బాలుర వసతిగృహాన్ని పునఃప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.

పేదలకు దుస్తులు, నిత్యావసరాల పంపిణీ



శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ పండుగను పురస్కరించుకుని పేదలకు దుస్తులు, నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ నరసింహమూర్తి హాజరై పేదలకు పంపిణీ చేశారు. హెల్పింగ్‌హ్యాండ్స్ అధినేత మునీర్‌బాషా, 1వ పట్టణ సీఐ గోపి, సంస్థ సభ్యులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, హరి, కంఠా ఉదయ్, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై రెండు రోజుల పాటు సదస్సులు

పిచ్చాటూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 24, 25 తేదీల్లో విద్యుత్ సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం పిచ్చాటూరు, వేలూరు సబ్ స్టేషన్ పరిధిలో, మంగళవారం గోవర్ధనగిరి, కారూరు సబ్‌స్టేషన్‌లలో సదస్సులు జరుగుతాయన్నారు. రైతులు, వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

కరకంబాడి రైల్వే గేటు మూసివేత

రేణిగుంట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 28వ తేది సాయంత్రం 6గంటల వరకు కరకంబాడి రైల్వే గేటును మూసివేస్తున్నట్లు రేణిగుంట రైల్వే స్టేషన్ మేనేజర్ శేషగిరినాథ్ రెడ్డి చెప్పారు. స్థానికులు, ఆర్టీసి బస్సు డ్రైవర్లు సహకరించాలని కోరారు.

చంద్రయ్య కుటుంబానికి అండగా ఉంటాం


చంద్రయ్య భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీకాళహస్తి టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయ వాచ్‌మన్, టైలర్ సాయి చంద్రయ్య ముత్తరాశిపాళెంలోని తన స్వగృహంలో ఆదివారం మృతి చెందాడు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. అయన సూచనలతో చంద్రయ్య కుటుంబీకులకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, నాయకులు మిన్నల రవి, సుబ్బయ్య, పేట బాలాజీరెడ్డి, ప్రతాప్, మునిరత్నం, గోపాల్, దుర్గమ్మ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీకాళహస్తి టైలర్ అసోసియేషన్ సభ్యులు కూడా సాయి చంద్రయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి రూ5వేలు సాయం అందజేశారు.

మార్షల్ ఆర్ట్సతో ఆత్మస్థైర్యం పెంపు


విద్యార్థులతో డీఎస్పీ నరసింహమూర్తి తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ వల్ల ఆత్మస్థైర్యం, శారీరక దృఢత్వం పెరుడుతుందని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో కెనీ షిటోర్యూ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ ఫీడింగ్ ఈయామినేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు గోపి, వెంకటేశ్వర్లు, రవి నాయక్, తిమ్మయ్య, కరాటే కోచ్ ధనుష్, కమిటీసభ్యులు సతీష్, సురేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల కడుపు కొట్టొద్దు: సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న గురవయ్య

శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల కడుపు కొట్టొద్దని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య కోరారు. శ్రీకాళహస్తి పట్టణంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికుల్లో ఎక్కువమంది మహిళలున్నార న్నారు. కొంతమంది అధికారులు వారి కడుపులు కొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని మేరకు మెను ఛార్జీ ఒక్కొక్కరికి కనీసం రూ.20 పెంచాలన్నారు. కార్మికులకు రూ.10వేలు తక్కువ కాకుండా ఇవ్వాలన్నారు. శ్రీనివాసులు, రాజేశ్వరి, శ్రీనివాసులు, సునీత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో పుత్తూరు మున్సిపాలిటీ మొదటి స్థానం

పుత్తూరు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 2024 - 25 పన్ను వసూళ్లలో పుత్తూరు మున్సిపాలిటీ తిరుపతి జిల్లా పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది. పన్నుల డిమాండ్ రూ.4.94 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.3.45 కోట్లతో 70 శాతం వసూలు నమోదు చేసింది. ఈ వసూలుతో రాయలసీమ పరిధిలో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ నెలాఖరుకు 85 శాతం వసూలు చేయాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. పట్టణ పరిధిలో 13,134 అసెస్‌మెంట్లు ఉన్నాయి. పుత్తూరు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల ప్రజలు పట్టణ వాతావరణానికి అలవాటు పడలేకపోతున్నారు. పన్నుల వసూలుకు వెళుతున్న అధికారులకు వారి నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వ్యవసాయం చేసుకుని జీవించే తమ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసి తమకు ఈ పన్ను బాధలు ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. నందిమంగళం, పళ్లూరు, తిమ్మాపురం, రాచపాలెం, కేఎంఅగ్రహారం, చిన్నప్పనాయుడు కండ్రిగ, గంగమాంబపురం, తాయిమాంబపురం తదితర ప్రాంతాల ప్రజలు పన్నులు చెల్లించేందుకు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. దీంతో పన్ను వసూలు ప్రక్రియ అధికారులకు ప్రహసనంగా మారింది. అంతే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కార్యాలయాల నుంచి రావాల్సిన పన్నులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బకాయి రూ.1.39 కోట్లు ఉండగా, రైల్వే శాఖకు చెందిన బకాయి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీలకు పన్నులు చెల్లించే విషయమై రైల్వే శాఖ, మున్సిపల్ శాఖల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ వివాదం పరిష్కారమైతే కానీ పన్నులు చెల్లింపు పరిస్థితులు కనిపించడం లేదు. ఈ పరిణామాల క్రమంలో 85 శాతం పన్ను వసూలుకు అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. పన్ను బకాయిదారులు చాలా మంది రాష్ట్ర ప్రభుత్వం నుంచి మినహాయింపు ఉత్తర్వులు వస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లించాలని బకాయిదారులపై ఒత్తిడి చేస్తున్నారు. కాగా, మరో 7 రోజుల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. లక్ష్యాన్ని చేరుకునేందుకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది కార్యాచరణకు పూనుకున్నారు.

ఆవిరైన మామిడి రైతుల ఆశలు

ఉగాది పచ్చడి, ఊరగాయకూ కరువే?



పూత రాలిపోయి మిగిలిన కాండాలతో మామిడి చెట్లు

పుత్తూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి పూతలు విస్తారంగా వచ్చింది. అయితే ప్రతికూల వాతావరణం పరిస్థితుల వలన పూత ఆలస్యంగా రావడం విదితమే. సాధారణంగా నవంబర్, డిసెంబర్‌లలలో పూత వచ్చి సంక్రాతిలో పిందెలు ఏర్పడి శివరాత్రికి శివలింగం మామిడి కాయ ఉండాలని పెద్దల నానుడి. అటువంటింది గత ఏడాది అత్యధిక వర్షపాతం వలన పూతలు ఫిబ్రవరి కూడా రాలేదు. మార్చిలో పూత రావడంతో అప్పటికే ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మగ్గిపోయి రాలిపోయింది. కాండాలు మాత్రమే నిలబడ్డాయి. దీంతో పూత బాగా వచ్చిందని సంబరపడిన రైతులు.. పూత మాడిపోవడంతో దిగాలు పడిపోయారు. ఉగాది సమీపిస్తున్నప్పటికీ పచ్చళ్లు వేసే వారు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యేటా ఏదో విధంగా రైతులకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తుతున్నాయి. తూర్పు మండలాల్లో పుత్తూరులో సుమారు 9 వేల ఎకరాలు, వడమాలపేటలో 11 వేల ఎకరాలు, విజయపురంలో 14 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. దీనిపై రైతులు మాట్లాడుతూ... అప్పు చేసి రెండు మూడు సార్లు పూత నిలబడడానికి మందులు పిచకారీ చేశామన్నారు. అయితే పూజ మగ్గిపోయి రాలిపోవడంతో దిక్కుతోచని స్థితికి చేరుకున్నట్టు వాపోయారు. దీంతో చేసేది లేక ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆలోచిస్తున్నారు.

రెండు కంటైనర్ లారీల ఢీ



రేణిగుంట, మార్చి 23, (ఆంధ్రజ్యోతి): రెండు కంటైనర్ లారీలు ఢీకొనడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన ఆదివారం ఉదయం కొత్త చెక్ పోస్ట్ కూడలిలో జరిగింది. శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వెళ్తున్న కంటైనర్ లారీని కడప నుంచి చెన్నై వెళ్తున్న మరో కంటైనర్ లారీ కూడలి మలుపు వద్ద ఢీకొనింది. దీంతో కూడిలిలో నాలుగు పక్కల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఈదులగుంటలో బోరు ఏర్పాటు



శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం ఈదులగుంటలో ఐదు సంవత్సరాలుగా చేతిబోరు మరమ్మతులకు గురైంది. కాలనీవాసులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా బాగు కాలేదు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు అమ్ములు, విజయకుమార్‌నాయుడు ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి నూతన బోరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం బోరును ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలుతెలిపారు.

26న నల్లగంగమ్మ జాతర

శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేట తెట్టులో కొలువై ఉన్న నల్లగంగమ్మ అమ్మవారి జాతర ఈనెల 26వ తేదీ బుధవారం జరగనున్నట్లు ఆలయ ధర్మకర్త కంఠా రమేష్ తెలిపారు. జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

విద్యుత్ సామగ్రి వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డు పరిధిలో నూతనంగా వినాయకస్వామి ఆలయ నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం 2వ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, ఉసిరిపాటి శ్రీనివాసులు రూ.25వేలు విలువైన విద్యుత్ సామగ్రిని వితరణ చేశారు. జనమాల గురవయ్య, ఆలయ కమిటీ సభ్యులు రాజా, బాల, ప్రజా సంఘాల నాయకులు గోపి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.